ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023 5 విజయనగరం



సిటియులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి గాను నిర్వహిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని, ఈనెల 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సిటియు విసి ప్రొఫెసర్ కట్టమణి తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, మాస్టర్ అఫ్ సోషల్ వర్క్, మాస్టర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ అఫ్ ట్రైబల్ స్టడీస్, మాస్టర్ అఫ్ ఇంగ్లీష్, మాస్టర్ అఫ్ సోషియాలజీ, మాస్టర్ అఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లలో అడ్మిషన్ కోసం నిర్వహించే అర్హతపరీక్ష (సియుఇటి)ను జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోందని తెలిపారు. దీనికి సంభందించిన నోటిఫికేషన్ ఇప్పటికే ఎన్‌టిఎ వెబ్‌సైట్‌లో వెల్లడైందని తెలిపారు. అత్యంత తక్కువ ఫీజులతో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ కట్టిమని తెలిపారు.

కార్పొరేట్‌కు ధీటుగా... మహిళా మార్టులు



గరివిడిలోని మహిళా మార్టు

- గరివిడి, ఎస్.కోటల్లో సరుకుల విక్రయాలు
- బహుళ జాతి సంస్థలతో అనుసంధానం
- స్వయం సహాయక సంఘాలతో డిఆర్‌డిఎ వినూత్న ప్రయోగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను... పైసా పైసా కూడ బెట్టి నెలనెలా పొదుపు ఖాతాల్లో జమచేసుకున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు నేడు కార్పొరేట్ శక్తులను ధీటుగా మహిళా మార్టులను ఏర్పాటు చేసి ఔరా...! అనిపిస్తున్నారు. ఇక్కడ దొరకని సరుకులు, వస్తువులు లేవంటే అతిశయోక్తి కాదు. స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న వస్తు, సామగ్రి మొదలుకుని బహుళ జాతి సంస్థల్లో లభ్యమయ్యే సరుకులన్నీ ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. ధరలు కూడా మిగిలిన దుకాణాలతో పోలిస్తే ఎంతోకొంత తక్కువే. దీంతో, వినియోగదారులు ఎగబడుతున్నారు. రోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. డిఆర్‌డిఎ సహకారంతో ఏర్పాటు చేసిన మహిళా మార్టులపై అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడం, అప్పుడప్పుడు చిన్న చితక స్వయం ఉపాధి పథకాలు చేపట్టడం, అందుకోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం విధితమే. ఇందులో భాగంగానే ఈసారి ఎక్కువ మంది సభ్యులతో కలిపి అన్ని రకాల నిత్యవసర సరుకులు, గృహాల్లో వాడే వస్తుసామగ్రి విక్రయాలు చేపట్టేవిధంగా డిఆర్‌డిఎ చొరవ చూపింది. ఇందుకనుగుణంగా మహిళా మార్ట్ అనే బృహత్తర పథకాన్ని రూపొందించడంతోపాటు సభ్యుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా వైఎస్ఆర్ చేయూత, ఆసరా పథకాలు పొందుతున్న స్వయం సహాయక సంఘాలను ఐక్యం చేసింది. అనుకున్నదే తడవుగా గరివిడి, చీపురుపల్లి మండలాల్లో వేర్వేరుగా రూ.350 చొప్పున మూలధన వాటాగా సమకూర్చుకున్నారు.

గరివిడి మండలంలో 16,585 మంది సభ్యులు కలిసి రూ.52లక్షలు సమకూర్చుకున్నారు. ఎస్.కోటలో 12,168 మంది కలిసి రూ.38లక్షలు పోగుచేశారు. వీరిని వెన్నంటి ప్రోత్సహిస్తున్న డిఆర్‌డిఎ అధికారులు మార్టుల ఏర్పాటుకు ఎంఎసిఎస్ యాక్టు ప్రకారం జిఎస్‌టి, పాన్‌కార్డు, టిఐఎన్, ఫుడ్ లైసెన్స్, లేబర్ లైసెన్స్ అనుమతులు తెచ్చుకునేందుకు సహకారం అందించారు. దీనికితోడు రిలయన్స్, ఐటిసి, హెచ్‌యుఎల్, పిఅండ్‌జి, ఫిలిప్‌కార్డ్ వంటి బహుళ జాతీ సంస్థలతో అనుసంధానం చేసుకునేందుకు తోడ్పాటునందించారు. దీంతో, ప్రతి సరుకు లేదా వస్తువుపై ఎంఆర్‌పిపై 10శాతం తక్కువ ధరకు విక్రయాలు చేపడుతున్నామని ఆయా మార్టులు నిర్వహిస్తున్న సభ్యులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఈ రెండు మార్టులు నిత్యం కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. రోజూ సుమారు రూ.83వేల నుంచి రూ.లక్ష విలువగల విక్రయాలు జరుగుతున్నాయని నిర్వాహకులు, డిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. తద్వారా మార్టులకు 28,753 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు యజమానులుగా మారారు. మొత్తంగా 10మంది సభ్యులు వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మరికొంతమంది సభ్యులు ప్యాకింగ్‌లో భాగస్వామ్యమవుతూ రోజువారీ ఆదాయాన్ని పొందుతున్నారు.

మార్టులు నడిపేందుకు ప్రత్యేక శిక్షణ

మార్టులు ఏర్పాటు చేసి, సరుకులు విక్రయించుకుని బతికేయాలంటూ కేవలం ఉచిత సలహాలిచ్చి వదిలేయలేదు. సభ్యుల్లో కొంతమందిని అందరి సహకారంతో బోర్డ్ ఆఫ్‌డైరెక్టర్లుగా నియమించారు. వారిని కాకినాడ, ఉప్పాడ కొత్తపల్లి, అనకాపల్లి జిల్లా వి.మాడుగల్లో నడుస్తున్న మహిళా మార్టుల సందర్శనకు తీసుకెళ్లారు. వ్యాపార నిర్వహణకు అవసరమైన విషయ పరిజ్ఞానంపైనా, మౌలిక సదుపాయాల ఏర్పాటుపైనా విజయవాడ, పెందుర్తి టిడిడిసిల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. మరో వైపు మార్కెటింగ్, సాంకేతిక సహకారం డిఆర్‌డిఎ అధికారులు అందిస్తోంది.

సమర్ధవంతంగా నడుస్తున్నాయి



స్వయం సహాయక సంఘాల సభ్యులు తమకు వస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించేందుకు రకరకాల పథకాలు రూపొందించాం. అందులో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా మార్టులు ఎంతో సమర్ధవంతంగా నడుస్తున్నాయి. వివిధ వ్యాపార సంస్థలతో అనుసంధానం చేయడంతో పాటు నిర్వాహకులకు వ్యాపార మెలకువలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. ఇటువంటి మహిళా మార్టులు మరిన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

కల్యాణ్ చక్రవర్తి , డిఆర్‌డిఎ పీడీ

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ అండ

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- ద్వారపూడిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంటివద్దకే వైద్య సేవలను అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలోని ద్వారపూడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా 104 సంచార వైద్యశాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి బొత్స మాట్లాడుతూ, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దేశంలో ఎక్కడా లేని విధంగా, పేదల ఇంటివద్దకే వైద్య సేవలను అందించడం ఒక వినూత్న ప్రక్రియగా పేర్కొన్నారు. ప్రజల బాగోగులను పట్టించుకొనే ప్రభుత్వమే పదికాలాలు నిలిచి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని 66 పిహెచ్‌సిల్లోనూ ఇద్దరు వైద్యులను నియమించామని, ఒక డాక్టర్ ఆసుపత్రిలో ఉంటే, మరో డాక్టర్ 104 వాహనంలో గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తారని చెప్పారు. గొప్ప సదుద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తల్లితండ్రులు కూడా అప్పుడప్పుడూ పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు అందడంతోపాటు, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈనెల 13 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని, సంక్షేమ పథకాలు అందని లబ్దిదారులు నేరుగా ముఖ్యమంత్రికే ఫోన్ చేసి చెప్పుకోవచ్చని సూచించారు.

కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యుల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని, ఆర్ఎంపిల దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. రక్తం పెరగాలంటే చింతపండు వాడకాన్ని, జంక్ ఫుడ్స్‌ను తగ్గించాలని, చిరుధాన్యాల వాడకాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, ఎంపిడిఒ గంటా వెంకటరావు, తాహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఎంఇఒ రాజు, నడిపేన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీల్లో జారాకు కాంస్య పతకం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

జిల్లాకు చెందిన ఎస్.జారా జాతీయ సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. కేరళ రాష్ట్రం కోజీకోడ్‌లో జరిగిన జాతీయ సీనియర్ విభాగంలో 77.5 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించిన దేశ నాయకుల విగ్రహాలు

దండిమార్చ్ నాయకుల విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద దేశ నాయకుల విగ్రహాలతో ఏర్పాటు చేసిన దండి మార్చ్ ఐకాన్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో వైసిపి పాలన ప్రారంభం నుంచి అన్ని ప్రధాన జంక్షన్ లను సుందరగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందకు కృషి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు, నగర పాలక వర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. దేశ నాయకుల స్ఫూర్తిని, దండి లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం స్ఫూర్తిని యువతలోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇటువంటి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారం రోజులు పాటు రోడ్లు, కాలువలు, కొత్త సచివాలయాలు ప్రారంభం వంటి అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ దేశ నాయకులు మనకు అందించిన స్ఫూర్తిని, పోరాట పటిమ గుర్తు చేసుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. త్వరలో జంక్షన్ పేరును కూడా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి,డెప్యూటీ మేయర్లు రేవతిదేవీ, శ్రావణి, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి మృతితో పర్లలో విషాదం

నేడు స్వగ్రామానికి గోవింద్ మృతదేహం ● శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



రోదిస్తున్న గోవింద్ కుటుంబ సభ్యులు



గోవింద్ (ఫైల్)

ప్రజాశక్తి-గరివిడి

పారాచ్యూట్ డ్రైవింగ్ శిక్షణలో మృతి చెందిన నేవీ ఉద్యోగి చందక గోవింద్ (30) మృతితో ఆయన స్వగ్రామం చీపురుపల్లి మండలం పర్ల గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. విశాఖలోని నేవీలో 2012 నుంచి ఉద్యోగం చేస్తున్న గోవింద్ మెరైన్ కమాండోగా విధులు నిర్వహిస్తున్నాడు.

పశ్చిమ బెంగాల్ లోనీ బుద్వాల్ జిల్లాలో పారా ట్రూపార్స్ టీంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం శిక్షణలో భాగంగా పారాచ్యూట్‌లో ఎయిర్‌క్రాక్ నుంచి కిందకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా పారా చ్యూట్ తెరుచుకోలేదు. దీంతో వందల మీటర్ల ఎత్తునుంచి ఆయన కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్య నిపుణులు తెలిపారు. ఈ విషయాన్ని నేవీ ధికారులతో ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీ రయ్యారు. స్వగ్రామం పర్లలో తీవ్ర విషాదం అలము కుంది. గోవింద్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందాడు. తల్లి లక్ష్మి, సోద రుడు ఈశ్వరరావు, సోదరి గౌరీ ఉన్నారు. కుటుంబా నికి ఆధారమైన గోవింద్ చని పోవడంతో కుటుంబ సభ్యులంతా కన్నీరుమున్నీరయ్యారు. ఎప్పుడూ దేశ సేవకే అంకితమయ్యాడని, చివరకు ఆ వృత్తిలోనే ప్రాణాలు విడిచాడని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

దేశ సేవకే గోవింద్ అంకితం

పరాగ్ ఎయిర్‌పోర్టు స్టేషన్లో ఉన్న ఊహాత్మక విమానాల్లో జవాన్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ ఉంటారు. ఇండియన్ ఆర్మీ నేవీ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన స్పెషల్ ఫోర్సెస్ యూనిట్లు ఈ శిక్షణలో పాల్గొంటాయి. పారా ట్యూబర్ల బృందంలో సభ్యులైన గోవింద్ మిలట్రీ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి సాధారణ డ్రాబ్స్ సమయంలో సాంకేతిక లోపం కారణంగా పారా చ్యూట్ తెరుచుకోపోవడంతో అమరులయ్యారు. గోవింద్ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు నేవీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో గోవింద్ అంత్యక్రియలు జరగనున్నాయి.

ప్రొఫెసర్ పద్మజకు డాక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ లో ఇఇఇ విభాగాధిపతిగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.పద్మజకు డాక్టరేట్ లభించింది. ఆమె 'ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోల్ ఆఫ్ మల్టీ-ఏరియా హైబ్రిడ్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు జెఎన్‌టియు కాకినాడ వారు పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.స్వామి నాయుడు, పలు విభాగాల అధిపతులు అభినందించారు.

హిందీ పరీక్షకు 99.76 శాతం మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురువారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 99.76 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులు 24095 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 56 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 50 మంది హాజరు కావాల్సి ఉండగా, వారిలో 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఒ లింగేశ్వర రెడ్డి తెలిపారు. 67 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయని తెలిపారు.

మంత్రి అమర్‌నాధ్‌ను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఐటి శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్‌ను తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని జనసేన నాయకులు గురాన అయ్యలు డిమాండ్ చేశారు. అమాయక విద్యార్థుల మీద తన ప్రతాపాన్ని చూపేందుకు మంత్రి అధికారాన్ని దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. తాను వెళ్తున్న సమయంలో పవన్ కల్యాణ్‌కి మద్దతుగా విద్యార్థులు నినాదాలు చేస్తుంటే సహించలేక ఇటువంటి దాడులకు పాల్పడేటట్లు ప్రేరేపిస్తారా అని ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడి కోసం ఎవరూ మాట్లాడకూడదని కొత్త చట్టం ఏమైనా అమరనాథ్ చేశారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇటువంటి పోకడలకు స్వస్తి చెప్పకపోతే ప్రజాఛీత్కారాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి ఆదిమూలపు సురేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గురాన అయ్యలు అన్నారు.

రైతుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ వైవి రమణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పశువిజ్ఞాన బడుల ద్వారా రైతుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అలవడుతుందని దాన్ని రైతులు పాడి పశువుల పెంపకంలో వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వైవి రమణ తెలిపారు. గురువారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో జరిగిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ గర్భోత్పత్తికి ఉన్న అవకాశాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. గడ్డి కోసే యంత్రాలు సబ్సిడీ మీద అందిస్తున్నామని చెప్పారు. టిఎంఆర్ దాణాను కూడా 60 శాతం సబ్సిడీ మీద అందిస్తున్నట్టుగా తెలియజేశారు. పశుగ్రాస విత్తనాలను 70శాతం రాయితీపై అందిస్తున్నట్టుగా తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు నాలుగు టన్నుల పశు గ్రాస విత్తనాలు అందించినట్టు తెలియజేశారు. గ్రామ పరిసరాల్లో ఉన్న పశుగ్రాస క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి సౌజన్యంతో అఫ్రో స్వచ్ఛంద సంస్థ ద్వారా పశు గ్రాస విత్తనాలైన షుగర్ గ్రేజును 25 మంది రైతులకు ఉచితంగా అందించారు. అనంతరం ఆయన ధర్మవరం, ఎస్.కోట పశువైద్యశాలలను, పోతనాపల్లి ఆర్‌బికెని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ కోట పశువైద్యశాల ఏడి డాక్టర్ బి చలపతిరావు, ధర్మవరం పశు వైద్యశాల డాక్టర్ హేమ, ఆఫ్రో సంస్థ ప్రతినిధి శ్రీరాములు నాయుడు, గ్రామ సర్పంచ్, వైస్ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీపై పశు దాణాను అందిస్తున్న పశుసంవర్ధకశాఖ జెడి వైవి రమణ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పన్ను కడితేనే రిజిస్ట్రేషన్

- ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు
- నిలిచిపోయిన స్థలాల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించి ఎల్‌పి నెంబర్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో బొబ్బిలి, తెర్లాంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివాస స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఖాళీ స్థలాలకు పన్ను (వి.ఎల్.టి) చెల్లించి ఆస్థలం ఉన్న లే అవుట్ ఎల్.పి నెంబర్ ఇవ్వాలి. ఈ రెండింటిలో ఒకటి లేకపోయినా రిజిస్ట్రేషన్ చేయకూడదని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంతో బొబ్బిలి, తెర్లాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నివాస స్థలాల రిజిస్ట్రేషన్ గత నాలుగు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో స్థలం అమ్మకం, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన నిబంధనలతో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ మాత్రమే జరుగుతున్నాయి.

తగ్గిపోయిన ప్రభుత్వ ఆదాయం

ఖాళీ స్థలాల పన్ను చెల్లించి ఎల్.పి నెంబర్ ఉంటేనే నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రభుత్వాదాయం తగ్గిపోతుంది. బొబ్బిలిలో రోజుకు 30 నుంచి 40 వరకు రిజిస్ట్రేషన్లు జరగ్గా వీటిలో 25 నుంచి 35 వరకు నివాస స్థలాల రిజిస్ట్రేషన్లు ఉంటాయి. తెర్లాంలో రోజుకు 10 నుంచి 15 రిజిస్ట్రేషన్లు జరగ్గా వీటిలో 5 నుంచి 10 వరకు స్థలాల రిజిస్ట్రేషన్ ఉంటాయి. స్థలాల రిజిస్ట్రేషన్ నిలిచిపోవడంతో రోజుకు రూ.8 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఆదాయం తగ్గిపోయింది. పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అనుమతులు ఇస్తేనే రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని స్థలాల క్రయ విక్రయదారులు అంటున్నారు.

సుక్రాస్ ఫ్యాషన్ అకాడమీ ప్రారంభం



ఫ్యాషన్ అకాడమీని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుక్రాస్ బ్యూటీ అండ్ ఫ్యాషన్ అకాడమీని గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్వాలిటీ తో కూడిన బ్యూటీషన్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఇళ్లలో జరిగే పెళ్లి, శుభ కార్యా లయాలకు పెళ్లి కూతురు, పెళ్లి కొడుకును తయారు చేసి శుభకార్యం జరిగే వరకు పూర్తి బాధ్యత తీసుకునే విధంగా సుక్రాస్ సేవలు అందించడం కొత్త ఒరవడికి నిదర్శనమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అంపోలు సుధారాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు వారి ఆర్థిక స్థితి, అభిరుచిని బట్టి తయారు చేస్తామన్నారు. వ్యాపారాభివద్ధికి నగర, జిల్లా ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రావణి, మాజీ కౌన్సిలర్ కోలగట్ల రమణి, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఖోఖోలో పోలీసులకు కాంస్య పతకం



పోలీసులను అభినందిస్తున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో గతనెల 21 నుంచి 25వరకు జరిగిన 71వ అఖిల భారత పోలీసు అథ్లెటిక్స్ క్లస్టర్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు ఖోఖో జట్టు కాంస్య పతకం సాధించింది. ఆ జట్టులో సభ్యులైన జిల్లా పోలీసులను ఎస్‌పి ఎం.దీపిక గురువారం జిల్లాపోలీసు కార్యాలయం లో అభినందించారు. ఆ జట్టులో జిల్లా పోలీసుశాఖకు చెందిన నలుగురు కానిస్టేబుళ్ళు క్రియాశీలకంగా వ్యవహరించి, తమ క్రీడా ప్రతిభను చాటారన్నారు. ఎం.లక్ష్మణ (ఎస్‌టిఎఫ్ కానిస్టేబుల్), పి.హరీష్ (సివిల్ కానిస్టేబులు, భోగాపురం), పి.రాము, ఎస్.అప్పలరాజు (ఎస్‌టిఎఫ్ కానిస్టేబులు), రాష్ట్ర ఖోఖో జట్టు విజయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎస్‌పి అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతులను, జిఎస్ఇలను ప్రకటించారు.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు': ఎమ్మెల్యే

గజపతినగరం : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నియోజకవర్గంలోని పురిటిపెంట గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఎంపిపి, జెడ్‌పిటిసి, పార్టీ కన్వీనర్ లు, వాలంటీర్లు, గృహసారధులు వివరిస్తారని అన్నారు. నియోజకవర్గం మొత్తం వైసిపి శ్రేణులు దీనిలో భాగస్వాములు కావాలని అన్నారు.

క్రాష్ ప్రోగ్రాం సద్వినియోగం : ఎంపిపి


వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి సుధారాణి

నెల్లిమర్ల : మండలంలోని నిర్వహించనున్న క్రాష్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో క్రాష్ ప్రోగ్రాంను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజ తాగునీటి ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తగా చేతిపంపులను మరమ్మత్తులు చేయడానికి క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రభుత్వం చేపట్టిందన్నారు. వేసవిలో చెరువులు, బావుల్లోని నీటిమట్టం తగ్గడంతో చేతిపంపులు, బావుల నీరు అడుగంటి నీటి సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో చేతి పంపులను ముందస్తుగా పూర్తిస్థాయిలో బాగుచేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు క్రాష్ ప్రోగ్రాం ప్రారంభించడం జరిగిందన్నారు. మండల స్థాయిలో రెండు టీములను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో అన్ని బోర్లను తనిఖీ చేసి వాటికి మరమ్మత్తులు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంపిడిఒ జి గిరిబాల, గ్రామీణ నీటి సరఫరా పథకం ఎఇ మహమ్మద్ హిదాయత్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

30వరకు పన్ను రాయితీ : కమిషనర్

నెల్లిమర్ల : నగర పంచాయతీ వాసులు 5శాతం పన్ను రాయితీ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీలో ఈ నెల 30లోగా పన్నులు చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు ఈ నెల 30లోగా ఏక కాలంలో చెల్లించిన వారికి 5శాతం రాయితీ ఇవ్వనున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గురుకులం ఆకస్మిక సందర్శన

నెల్లిమర్ల : స్థానిక సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకులాన్ని గురువారం సాంఘిక సంక్షేమ విద్యాలయాల శాఖ రాష్ట్ర కార్యదర్శి ఆర్.పావన్ మూర్తి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శాఖా పరమైన రికార్డ్స్ పరిశీలించి తగు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థినులతో పరీక్షలపై అడిగి తెలుసుకున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థినులకు బైజుస్ కంటెంట్‌ని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థినుల గదికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి గణితంపై మంచి పట్టు సాధించాలని, వాటిని నిత్య జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. భోజన గదుల సముదాయాన్ని చూసి వాటికి అవసరమైన సదుపాయాల కోసం అంచనా విలువలు ఇంజినీర్ అసిస్టెంట్ సహాయంతో పంపమని ప్రిన్సిపాల్‌కి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శితో బాటు జిల్లా సమన్వయ కర్త బలగ చంద్రావతి, ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు: ఎస్ఐ

కొత్తవలస : రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు గానూ ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి నడిపిస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలుంటాయని ఎస్ఐ బొడ్డు దేవి, వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, భద్రతా చర్యలు తీసుకోకపోవడం, అతి వేగం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి వాటికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టారు. 8వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వాహన చోదకులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు సూర్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహారా చెల్లింపులు చేపట్టాలని ఘెరావ్

బొబ్బిలి : సహారా ఖాతాదారులకు చెల్లింపులు ప్రారంభించాలని సహారా రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, బ్రాంచ్ మేనేజర్ కృష్ణను ఏజెంట్లు, ఖాతాదారుల అసోసియేషన్ నాయకులు బివిఎల్ దాసు, వైఎ నాయుడు, ఎ.జి.కె నాయుడు, రాజు, ఏజెంట్లు బొబ్బిలి సహారా కార్యాలయంలో గురువారం నిలదీశారు. బొబ్బిలి కార్యాలయానికి ఆర్ఎం రావడంతో ఏజెంట్లు అసోసియేషన్ నేతలు, ఖాతాదారులు చేరుకుని నిలదీశారు. సహారా చెల్లింపులు చేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. బాండ్లు మెచ్యూరిటీ అయిన చెల్లింపులు చేయకుండా రెన్యువల్ చేయడం అన్యాయమన్నారు. తక్షణమే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


వంగర: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి : విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఇఒ వరప్రసాదరావు సూచించారు. గురువారం అంబాడ వెంకటాపురం పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన పథకం అమలు చేయాలని అన్నారు. భోజనం సమయంలో ఆహారంతో పాటు తాగునీరు అందించాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా కృషి చేయాలన్నారు. ఈయనతోపాటు ప్రధానోపాధ్యాయులు ఎంవిఎ రామకృష్ణ, సహ ఉపాధ్యాయులు నారాయణరావు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వంగర: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఇఒ యాగాటి దుర్గారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ భోజనం నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, సచివాలయ వెల్ఫేర్ అధికారి బి నరేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని చియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని బలిఘట్టం గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్‌ను ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ పేద ప్రజలకు కనీస వైద్యం చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో చియ్యంపేట వైద్యులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ సింహాద్రి నాయుడు, సర్పంచ్ పులిబంటి రాము, దేవాడ సర్పంచ్ గంతకూర జయకుమార్, ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు, పిహెచ్‌సి సూపర్‌వైజర్లు, పద్మావతి, రాము, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగ : గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించడమే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ఆమె మండలంలోని కొనాడ, కందివలస గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అందే వైద్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న సిఎం జగన్ మనసుతో కొనియాడాలన్నారు. గోవిందపురం వైద్యులు డాక్టర్ రాజేష్‌కృష్ణ, కె త్రినాథ్ మాట్లాడుతూ ఇకపై ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచులు పుప్పాల లక్ష్మినారాయణ, మహంతి జనార్ధనరావు, కందివలస సర్పంచ్ దేశెట్టి గణేష్, కొనాడ నాయకులు దాడిశెట్టి త్రినాధరావు, బొడ్డు ఎల్లాజీ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ పిహెచ్‌సి పరిధిలోని గల ఎస్‌కెఆర్‌పురం, బొద్దాం పిహెచ్‌సిలలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని డిసిహెచ్ డైరెక్టర్ వి.వి. వినరామనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఇంటి వద్దనే వైద్య సేవలు అందజేయడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి సత్యవంతుడు, ఎంపిపి వైస్‌చైర్మన్ ఎం. కస్తూరి, ఎంపిటిసి లక్ష్మి, సర్పంచ్ రామసత్యవతి, జి. దేవి, ఎంపిటిసి సత్యనారాయణ, బొడ్డు శ్రీను, వైద్యాధికారులు ధరణి, సతీష్ కుమార్, ఎంపిడిఒ పట్నాయక్, సిహెచ్ఒ ఆంజనేయులు, డాక్టర్ రాజు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.



ఎస్‌కోట: 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

సర్పంచ్‌కి, ఎంపిటిసికి అందని సమాచారం

వేపాడ: పాటూరు గ్రామంలో గురువారం సర్పంచ్, ఎంపిటిసికి ఏ విధమైన సమాచారమూ లేకుండా అధికార పార్టీ నాయకులు వైయస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వాహనాన్ని ప్రారంభించడం దుమారం రేగింది. గ్రామంలో ప్రోటోకాల్ పాటించకుండా ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వాహనాన్ని వైసిపి నాయకులు తమ సొంత సొమ్ముతో మంజూరు చేసిన వాహనంగా గ్రామ సర్పంచ్‌కు తెలియకుండా ప్రారంభించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అందుకు ఎంపిడిఒ కూడా పూర్తిగా సహకరించడం గ్రామ ప్రథమ పౌరురాలని కించి పరచడం కాదా? అని మండిపడుతున్నారు. గతంలో కూడా పలుమార్లు ఆమెకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండానే ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టినట్లు సర్పంచ్ వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

లక్కవరపుకోట : మండల వ్యాప్తంగా 104 వాహనం ద్వారా ప్రతి గ్రామానికి వైద్య అధికారులు పర్యటిస్తారని స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మల్లివీడు పంచాయతీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి 104 వాహనాన్ని ఎంపిపి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా పిహెచ్‌సి వైద్యాధికారులు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు రెండుసార్లు పర్యటించి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు పివి మురళీకృష్ణ, ఆర్ సామ్రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు, వైద్య సిబ్బంది తోపాటు వైసిపి నాయకులు బుడమ శ్రీను, పెద్దిరెడ్డి వెంకటేష్, కాటపల్లి వెంకటరమణ, పి వెంకటరమణ , కె కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకొని ముందడుగు వేసిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని పక్కి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా మంజూరైన 104 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, వైద్యాధికారి సిహెచ్ రమేష్, పంచాయతీ వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపు కోట: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను గురువారం మండలంలోని గోపాలపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైద్య సేవల కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని దానికి పూర్తిగా స్వస్తి చెబుతూ డాక్టరే ప్రజల చెంతకు వెళ్లి వైద్య సేవలను అందజేసే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి మండలానికి రెండు పిహెచ్‌సి సెంటర్లు, ప్రతి సెంటర్‌కు ఇద్దరు డాక్టర్లను ఇప్పటికే నియమించామన్నారు. ఒక డాక్టర్ పిహెచ్‌సి సెంటర్ వద్ద వైద్య సేవలు అందజేస్తుంటే మరొక డాక్టర్ గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజల చెంతకు చేరి వైద్య సేవలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, గులిపిల్లి గణేష్, సీతారాంపురం ఎంపిటిసి గుమ్మడి సన్యాసిప్పడు, గోపాలపల్లి రమణ, రంధి గణేష్ మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమాలు ముమ్మరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. ఈ ప్రచారాల్లో మండల జెసిఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు స్థానిక నాయకులు అంతా చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో మండల స్థాయి పార్టీ బాధ్యులు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల7వ తేదీ నుండి 20వ తేదీ వరకు చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం పై దిశా నిర్ధేశం చేశారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి 15 నుంచి 20 నిమిషాల పాటు వారితో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరించాలన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు ప్రచార సామాగ్రిని ఆయన చేతుల మీదుగా సచివాలయ కన్వీనర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, మండల జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు,


రామభద్రపురం: కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పిఎసిఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రతి ఇంటికి లక్ష రూపాయల పైనే లబ్ధి చేకూరిందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు అన్నారు. గురువారం మల్లంపేటలో సచివాలయ కన్వీనర్లతో జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యచారణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజేయవలసిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారుదులపై ఉందన్నారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇంఛార్జులు, కోప్షన్ మెంబర్ రియాజ్ ఖాన్, వైసిపి కార్యకర్తలు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న ' అనే కార్యక్రమంలో భాగంగా గృహ సారథులకు గురువారం వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, జెఎసిఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్ర నాయుడు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగరాడ ఎంపిటిసి పిల్లా రోజా, పొట్నూరు శ్రీనివాసరావు, మన్మధరావు, పిల్ల గౌర్నాయుడు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఎస్.కోట -3 సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సంబంధించిన కిట్లు పంపిణీ శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం నిర్వహించారు. ఈ కర్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, మండల పార్టీ ప్రెసిడెంట్ మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, గులిపిల్లి గణేష్, జెసిఎస్ మండల ఇంచార్జ్ కె. వెంకట్రావు, వార్డు సభ్యులు ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.


ఇంటింట సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

మల్లంపేటలో డెంగీ

బొబ్బిలి:స్థానిక మల్లమ్మపేటలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన షేక్ రఫీ గత వారం రోజులుగా జ్వరంతో బాధ పడడంతో రెండు రోజుల క్రితం బొబ్బిలిలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. రక్త పరీక్షలు చేసిన వైద్యులు విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ డెంగీ ఉన్నట్లు నిర్ధారించారు. రఫీకి డెంగీ నిర్ధారణ కావడంతో మల్లమ్మపేటలో వైద్య సిబ్బంది బి.బలరాంనాయుడు, పైడపునాయుడు, ఎఎన్ఎం లు, ఆశలు గురువారం ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. దోమలు నివారణకు కుండీలు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. దోమలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది మల్లమ్మపేటలో దోమలు నివారణకు ఫాగింగ్ చేశారు.

వారపు సంత వేలం పాట వాయిదా

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస జిల్లా పరిషత్ వారపు సంతకు గురువారం జరిగిన వేలంపాట వాయిదా పడింది. జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ కె. రాజ్ కుమార్ అధ్యక్షతన జిల్లా పరిషత్ వారపు సంతకం వేలంపాట జరిగింది. ఈ వేలం పాటలో నలుగురు వ్యక్తులు రూ. 50వేలు చొప్పున డీడీలు కట్టి వేలం పాటలో పాల్గొన్నారు. గతేడాది ఈ వేలం పాట రూ.5.50లక్షలకు వెల్లగా ఈ ఏడాది ఆ స్థాయిలో పాట ముందుకు వెళ్లకపోవడంతో వాయిదా వేశారు. గతేడాది విరోతి కొండలరావు పాటను దక్కించుకోగా వారపు సంతలో సరేనా సౌకర్యాలు లేనందున ఆదాయం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వేలం పాటలో చిటికిరెడ్డి దేవుడమ్మ, విరోతి వెంకటలక్ష్మి, మాగులపల్లి కన్నబాబు, పెద్దిరెడ్ల అప్పలపాత్రుడు మొదలగు వారు పాల్గొనేందుకు ముందుకు వచ్చినా తక్కువుకు కోడ్ చేయడంతో వాయిదా వేస్తామని తిరిగి ఎప్పుడు జరుగుతుందో తదుపరి తేదీలు త్వరలో ప్రకటిస్తామని డిప్యూటీ సిఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.పద్మజ, పంచాయతీరాజ్ డిఇఒ స్వామి నాయుడు, ఇఒపిఆర్‌డి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.


వేలం పాట వేస్తున్న అధికారులు

16.97ఎకరాల జీడి తోటలకు ప్రభుత్వ వేలం

మండలంలోని రెల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 256/4,5,6,7,8 పరిధిలోగల ప్రభుత్వానికి చెందిన సుమారు 16.97 ఎకరాల జీడిమామిడి తోటలకు గురువారం రెవెన్యూ, పంచాయితీ, వ్యవసాయ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఆర్ఐ నెక్కలి కిషోర్ కుమార్, విఆర్ఒలు రాజారవీంద్ర, సుధీర్, గ్రామ సర్పంచ్ అల్లం సత్యన్నారాయణ సమక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించారు. పాటలో మొత్తం ఐదుగురు పాల్గొనగా మహాదాసు వెంకటరమణ రూ.15,500లకు తోటలను పాడుకున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎపిజివిబి సేవల పట్ల అసంతృప్తి

ప్రజాశక్తి - వేపాడ

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ వేపాడ బ్రాంచ్ పనితీరు పట్ల ఖాతాదారులు తీవ్ర అసంతృప్తిని, ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వేపాడ బ్యాంకులో తాము దాచుకున్న సొమ్మును తీసుకోవడానికి కూడా రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పలువురు ఖాతాదారులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏడాదంతా కష్టపడి సంపాదించిన సొమ్మును బ్యాంకులో దాచుకుంటే భద్రంగా ఉంటాయని ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకోవచ్చు అన్న ఆలోచనతో గ్రామీణ బ్యాంకులో వేసుకున్నప్పటికీ బ్యాంకు సిబ్బంది తమ అవసరాలకు సకాలంలో ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ బ్యాంకులో రూ.50వేలు తీసుకోవాలంటే సిబ్బంది నుండి క్యాష్ లేదని సమాధానం వస్తుంది తప్ప, సకాలంలో తమ అవసరాలు తీరడం లేదని వాపోయారు. తమకు క్యాష్ కావాలంటే ఉదయం 10 గంటలకే బ్యాంకుకు వచ్చి చెప్పుకోవాలని 12 గంటల తరువాత వస్తే క్యాష్ ఇవ్వలేమని సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నా అకౌంట్ లో ఉన్న సొమ్ము కోసం నా కొడుకు, నేను సోమవారం వచ్చాం. క్యాష్


బ్యాంకులో వేచి ఉన్న ఖాతాదారులు

లేదని మరలా రమ్మన్నారు. గురువారం వస్తే మరలా అదే సమాధానం చెబుతున్నారు. పనులు మానుకొని రావాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. ఏ బ్యాంకులో కూడా ఇటువంటి పరిస్థితి లేదని ఇక్కడే చూస్తున్నామని' సీతారాం అనే ఖాతాదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. తాము బ్యాంకులో దాచుకున్న సొమ్ముకి రోజంతా ఉండాలంటే ఎలా అని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. ఉదయం పూట వ్యవసాయ పనులకు వెళ్లక పోతే తమకు పూట గడవదని ఇటువంటి పరిస్థితుల్లో కూలీలను, వ్యవసాయదారులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి భోగాపురం

విమానాశ్రయ నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయించి సుమారు 60 రోజులు గడుస్తున్నప్పటికీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని జనసేన నియోజకవర్గం నాయకులు లోకం నాగ మాధవి అన్నారు. గురువారం పోలిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న మరడపాలెం నిర్వాసిత కాలనీలను ఆమె పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అసంపూర్తిగా భవనాలు ఉండిపోయాయని, ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలక మధ్యలో నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, భూములకు రావాల్సిన నష్టపరిహారం కూడా పూర్తిస్థాయిలో అందలేదని పలువురు బాధితులు జనసేన నాయకులు ముందు వాపోయారు. అనంతరం నాగ మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం విమానాశ్రయ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేసిందని అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూసేకరణ ఆలోచన తప్ప ప్రజలకు న్యాయం చేసే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ సంస్థ అధినేత లోకం ప్రసాద్, జనసేన నాయకులు రాంబాబు, పల్లంట్ల జగదీష్ నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు నిర్వహించాలి

అంగన్వాడీ కార్యకర్తలు పోస్టుల నియామకంలో రాజకీయ నాయకులు ప్రలోభాలకు లోను కాకుండా మెరిట్ ప్రాతిపదికన ఎంపికలు నిర్వహించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసిడిఎస్ పీడీ శాంతకుమారికి వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ భోగాపురం, పూసపాటిరేగ అధ్యక్షులు వందనాల రమణ, శివ, మహిళా నాయకులు ప్రమీల, బాసి దుర్గ పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- తెర్లాం

మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో నివాసముంటున్న సాంబార్కి శేఖర్ (18) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. శేఖర్ ప్రస్తుతం రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజుల సెలవు రావడంతో తన తల్లిదండ్రులను చూసేందుకు తెర్లాం వచ్చాడు. వాస్తవానికి వారి సొంత ఊరు మెరకముడిదాం మండలం సోమలింగాపురం. అయితే తల్లిదండ్రులు తెర్లాంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి తన స్వగ్రామమైన సోమలింగాపురంలో తన చెల్లెలు బట్టలు ఉన్నాయని వాటిని తిరిగి తెర్లాం తీసుకురావాలని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఎంఆర్ అగ్రహారం సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించి ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ తల్లిదండ్రులు తెర్లాంలో పైప్‌లైన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. చేతికి అంది వచ్చే కుమారుడు అకాల మరణంతో వారు బోరున విలపిస్తున్నారు. తెర్లాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శేఖర్ (ఫైల్)